సంజయ్ గైక్వాడ్‌పై చర్యలు తీసుకోవాలి


సంజయ్ గైక్వాడ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మన్సూరాబాద్: లోక్‌సభ ప్రతిపక్షనేత ఎంపీ రాహుల్‌గాంధీపై మహారాష్ట్రకు చెందిన షిండే గ్రూప్ ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉప సంహరించుకుని వెంటనే క్షమాపణలు చెప్పాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కిడి శివచరణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంజయ్ గైక్వాడ్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీజేపీ కూటమి పార్టీలు దేశంలో రిజర్వేషన్లు ఎత్తివేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అమెరికాలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలను బీజేపీ వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్‌గైక్వాడ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చరణ్, శ్యాంసుందర్ రెడ్డి, సతీష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పృథ్వీరాజ్, శ్యామల్ రెడ్డి, విఠల్‌రెడ్డి, బుంగరాజు, ఇరిగి రమేష్, చర్ల రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవంలో అధికారుల పాత్ర భేష్


సరూర్‌నగర్ కట్టపై నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

లింగోజిగూడ: వినాయక నిమజ్జనోత్సవంలో అధికారుల పాత్ర కీలకమని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.సరూర్‌నగర్ కట్టపై జరిగిన నిమజ్జనాలను అధికారులతో కలిసి మంగళవారం రాత్రి వరకు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందుస్తు చర్యలు తీసుకున్నారన్నారు. రెండు మూడు రోజుల నుంచి అధికారులు, సిబ్బంది విశ్రాంతి లేకుండా పనిచేసి నిమజ్జనాలు సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ డీసీ సుజాత, ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్, ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, శానిటేషన్ డీఈ చందన, ఏఎంహెచ్ఓ నగేష్ నాయక్, నాయకులు శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు. టమాట రూ.35, వంకాయ రూ.40, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.35, కాకర రూ.55, బీర రూ.55, క్యాబేజీ . 16, ఫ్రెంచి బీన్స్ రూ.60, క్యారెట్ రూ. 47, దొండ రూ. 45, చిక్కుడు రూ. 55-80, గోకర రూ. 45, బీట్‌రూట్ రూ. 28, క్యాప్సికం రూ. 70, ఆలు రూ. 40, దోస రూ. 23, సొర రూ. 19, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 50, చామగడ్డ రూ. 35. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ శైలజ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో డ్వాక్రా భవన్‌లో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో గ్రామ మహిళా సంఘాల సభ్యులతో రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. మానవ రవాణా అనేది పెద్ద నేరం అని, ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీని బారిన పడుతున్నారన్నారు. ప్రధానంగా పేద, మధ్య తరగతికి చెందిన అమ్మాయిలు ప్రేమ, పెళ్లిలు, సినిమాల అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారన్నారు. సెల్‌ఫోన్ వాడుతున్న అమ్మాయిలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని కోరారు. ప్రజ్వల సంస్థ కో–ఆర్డినేటర్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా నిర్మూలకు ప్రజ్వల సంస్థ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఇప్పటివరకు 28,600 మంది అమ్మాయిలను కాపాడి పునఃరావసం కల్పించామన్నారు. ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, పోలీస్, జ్యూడిషియల్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌ల సహకారంతో పని చేస్తున్నామని తెలిపారు. మండల ఏపీఎం సత్యనారాయణ, ఏపీఓ పరిమణ, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు కవిత, ప్రజ్వల సంస్థ ప్రతినిధులు అనిల్‌కుమార్, అంబర్ సింగ్, మిథాళి, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు కుమార్, రాజాబాబు, వీరాంజనేయులు, సురేశ్, యాదయ్య, సరోజ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మేయర్ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ హయత్‌నగర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్(పోషణ మాసం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఫలితంగా ప్రతీ ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పోషకాహారం లోపం పిల్లల్లో ఉండకూడదనే ఉద్దేశంతో యూఎన్‌ఓ ఆధ్వర్యంలో నడుస్తున్న యూనిసెఫ్ ప్రపంచ దేశాలకు పోషకాహారంతో కూడిన ఫుడ్‌ను అందిస్తోందన్నారు. అందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా పోషకాహారంతో పాటు గుడ్లు, ఇతర ఆహారాలను అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సీడీపీఓ రేణుక, ఎస్ఆర్‌హెచ్ఎం జిల్లా కో–ఆర్డినేటర్ ఆశ్రిత, జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం జరగనివ్వం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మీర్‌పేట: పేదలకు గతంలో ఇచ్చిన ఇంటి స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసి న్యాయం చేస్తోందని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడ వాసులతో బుధవారం కేఎల్లార్ సమావేశమయ్యారు. జిల్లెలగూడ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఇంటి స్థలాలు కేటాయించగా, భూమి కోర్టు పరిధిలో ఉండడంతో ఇప్పటివరకు పొజిషన్ ఇవ్వలేదని కేఎల్లార్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో పేదలకు అన్యాయం జరగదని, కోర్టు కేసుకు సంబంధించి పూర్వాపరాలు పరిశీలించి, న్యాయ నిపుణులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. దీంతో పాటు కోర్టు కేసులకు అయ్యే ఖర్చు మొత్తం తానే భరిస్తానని ఆయన హామీనిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్ గజ్జెల రాంచందర్, నాయకులు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, మదన్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



8 క్రేన్లు..3664 విగ్రహాల నిమజ్జనం

- మినీ ట్యాంక్‌బండ్‌లో కొనసాగుతున్న నిమజ్జనాలు
- వెంటనే వ్యర్థాల తరలింపు, పూడికతీత పనులు

చైతన్యపురి: సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ వద్ద బుధవారం సైతం నిమజ్జనాలు జరిగాయి. చివరి రోజు మంగళవారం వరకు 8 క్రేన్ల సహాయంతో 3664 విగ్రహాలు నిమజ్జనం జరిగాయని సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు. మరో రెండ్రోజులు నిమజ్జనం జరిగే అవకాశం ఉండటంతో మూడు క్రేన్‌లు అందుబాటులో ఉంచామన్నారు. ఆయా శాఖల సమన్వయంతో నిమజ్జనాలు సాఫీగా జరిగాయని అదనపు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జనం సందర్భంగా చెరువులో చేరిన వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. విగ్రహాల ఇనుప చువ్వలు బయటకు తీయించి ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నారు. అలాగే చెరువు నీటిలో పూడికతీత పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో..

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని కొలనులో నిమజ్జనం చేసిన విగ్రహాల వ్యర్థాలను బయటకు తీసి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ కొలనులో 8 ఫీట్ల ఎత్తు వరకు ఉన్న సుమారు 700లకు పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన నిమజ్జన కార్యక్రమం బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. నిమజ్జన ప్రక్రియ ముగిసిన వెంటనే విగ్రహాల వ్యర్థాలను తరలింపు ప్రారంభించారు. మరో రెండ్రోజుల వరకు క్రేన్ అందుబాటులో ఉంటుందన్నారు.

నిమజ్జనమైన విగ్రహాల వివరాలు

సోమవారం	-193 విగ్రహాలు
మంగళవారం	- 37 విగ్రహాలు
బుధవారం-	512 విగ్రహాలు
గురువారం -	418 విగ్రహాలు
శుక్రవారం-	148 విగ్రహాలు
శనివారం-	285 విగ్రహాలు
ఆదివారం-	838 విగ్రహాలు
సోమవారం-	533 విగ్రహాలు
మంగళవారం-	742 విగ్రహాలు


వ్యర్థాలను లారీలో తరలిస్తున్న దృశ్యం


చెరువు లోంచి బయటకు తీసిన ఇనుప చువ్వలు


మరో వైపు కొనసాగుతున్న పూడిక తీత పనులు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు

నాగోలు: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..వనస్థలిపురం, శారదానగర్‌కు చెందిన యేమినేని గోపి, అతడి తండ్రి వెంకటేశ్వర్‌రావుతో కలిసి ద్విచక్ర వాహనంపై బుధవారం సహార ఎస్టేట్ నుంచి మన్సూరాబాద్ ఎక్స్‌రోడ్ వైపు వస్తున్నారు. ఎల్‌బీనగర్ డీకే ఫర్నిచర్ ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే కారు డ్రైవర్ అజాగ్రత్తగా వచ్చి వీరి వాహనాన్ని ఢీ కొట్టడంతో గోపి కుడికాలు విరిగిపోగా వెంకటేశ్వర్‌రావు భుజానికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ నరేందర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు కుమార్తెలతో సహా గృహిణి అదృశ్యం


శ్రావణలక్ష్మి, భాగ్యలక్ష్మి, గగనశ్రీ

నాగోలు: ఇద్దరు కుమార్తెలను తీసుకుని ఓ గృహిణి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బండ్లగూడ కృషినగర్‌లో ఉండే చింతపల్లి నరేంద్ర భార్య భాగ్యలక్ష్మి(32), కుమార్తెలు శ్రావణలక్ష్మి(11) గగనశ్రీ(6) ఉన్నారు. ఈ నెల 16న కాలనీలో ఉన్న వినాయకుడి వద్ద భోజనం చేయడానికి వెళ్తున్నాని భర్తకు ఫోన్ చేసి వెళ్లింది. రాత్రి ఇంటికి వచ్చిన నరేంద్రకు తాళం వేసి ఉండటంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, చుట్టుపక్కల వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. సాగర్‌రింగ్‌రోడ్డు నుంచి బొబ్బిలి దామోదర్‌రెడ్డి గార్డెన్ సర్కిల్ వరకు.. సాగర్‌రింగ్‌రోడ్డు నుంచి టీకేఆర్ కాలేజీ కమాన్ వరకు నిర్మిస్తున్న డివైడర్ పనులను బుధవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివైడర్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రూ. 1.80 కోట్లతో పనులు చేపడుతున్నామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్పొరేటర్ వెంట ఏఈ మల్లికార్జున్ గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, బిక్కు నాయక్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఆధ్యాత్మిక సేవకు ముందుకు రావాలి


చంద్రశేఖర్‌గుప్తాను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని వాసవీ కాలనీవాసుల సంక్షేమ సంఘం మహాగణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. సుదీర్ఘకాలంగా కాలనీ అభివృద్ధికి కృషి చేసిన సంక్షేమ సంఘం అధ్యక్షుడు, అష్టలక్ష్మీ దేవాలయ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తాను గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ గుప్తా మాట్లాడుతూ.. సత్కారాలతో మరింత బాధ్యత పెరిగిందని సమాజ, ఆధ్యాత్మిక సేవకు వయస్సుతో సంబంధం లేకుండా అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి


రోడ్లను పరిశీలిస్తున్న కళ్లెం నవజీవన్‌రెడ్డి

లింగోజిగూడ: హయత్‌నగర్ పాత గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు.బుధవారం అధికారులతో కలిసి హయత్‌నగర్ పాత గ్రామంలో ఆయన పర్యటించి పలు రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కాలనీలలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్, ఏఈ హేము నాయక్, సిబ్బంది సురేష్, నాయకులు ఉగాది ఎల్లప్ప, నరేష్, ప్రేమ్ పాల్గొన్నారు.

సమ్మెలో సిబ్బంది.. రోగులకు ఇబ్బంది



ఆరోగ్య హెల్త్‌కేర్ ట్రస్ట్ సిబ్బంది చేస్తున్న సమ్మె కారణంగా ఎల్‌బీనగర్‌లోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్సకు వచ్చిన రోగులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ప్రభుత్వం స్పందించి ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధరించాలని కోరుతున్నారు. –మన్సూరాబాద్

లడ్డూ సొంతం.. భక్తుల ఆనందం


గణనాథుడి లడ్డూతో వైవీరెడ్డి


సహారాస్టేట్స్‌కాలనీలోని వినాయక లడ్డూతో ఆనందస్వామి కుటుంబ సభ్యులు


ప్రజయ్ గుల్మోహార్ మండపం లడ్డూను రూ. 5.69 లక్షలకు దక్కించుకున్న ఉపేందర్‌రెడ్డి అరుణను సన్మానించిన కెవీఎన్ రెడ్డి, రవికుమార్


హస్తినాపురం ద్వారకానగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూను దక్కించుకున్న లక్ష్మణ్‌నాయక్

ఫతుల్లాగూడ చెరువు.. సుందరీకరణ కనుమరుగు!

నాగోలు: చెరువులను సుందరీకరించి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పిన ప్రజాప్రతినిధుల మాటలు నీట మూటలుగానే మిగిలిపోయాయి. నాగోలు డివిజన్ పరిధిలోని ఫతుల్లాగూడ చెరువు కట్ట అభివృద్ధికి నోచుకోక కళావిహీనంగా మారింది. అభివృద్ధి చేయాల్సిన జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కట్టపై కంప చెట్లు మొలిచి అడవిని తలపిస్తోంది. గతంలో కొంత మేరకు వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం కొంతదూరం అభివృద్ధి చేసి బెంచీలు ఏర్పాటు చేశారు. పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం తీసిన రోడ్డుపై పెద్ద ఎత్తున్న కంప చెట్లు పెరిగి దారి మూసుకుపోయింది. భారీగా కంప చెట్లు పెరిగిపోవడంతో స్థానిక కాలనీ వాసులు అటువైపు ఎవరూ రాకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చెరువు కట్టపై పెద్ద ఎత్తున్న చెట్లు పెరిగిపోవడంతో రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువకులు అక్కడికి చేరుకుని మద్యం తాగుతూ హంగామా సృష్టిస్తున్నారు. కాలనీలకు దూరంగా ఉండటం.. పోలీసుల నిఘా లేకపోవడంతో ఫతుల్లాగూడ చెరువు కట్టపై అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువును సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని కోరుతున్నారు.


చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్‌లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు


చెరువు కట్టపై ధ్వంసమైన బెంచీలు


కంపచెట్లతో మూసుకుపోయిన దారి

అవగాహన కల్పించినా అదే నిర్లక్ష్యం!



నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జీహెచ్‌ఎంసీ అధికారులు, వివిధ రకాలుగా అవగాహన కల్పిస్తున్నా కొందరి నిర్లక్ష్యంతో అందరూ ఇక్కట్లకు గురి కావాల్సి వస్తోంది. ఇళ్లలో పోగయ్యే వ్యర్థాలను స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని.. రోడ్లపై వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నా వాటిని సైతం పట్టించుకోకుండా రోడ్లపైనే చెత్తను పారబోస్తున్నారని ఆయా ప్రాంతాల వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శివారు కాలనీలలో పరిస్థితి మరింత దారుణంగా మారింది.శివారు కాలనీలతో పాటు కాలనీల ప్రధాన రోడ్లలలో అడ్డగోలుగా చెత్తను వేస్తుండడంతో కాలనీల ఖాళీ ప్లాట్లు, రోడ్లు డంపింగ్ యార్డుగా మారాయి. పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాల్సిన సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పరిసరాలన్నీ దుర్గంధంగా మారుతున్నాయి. కుక్కలు, పశువులు ఆహారం కోసం చెల్లాచెదురు చేస్తుండటంతో పేపర్లు, కవర్లు వాహనాదారులపై పడి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై చెత్త వేస్తున్న వారికి భారీ జరిమానాలు విధిస్తేనే మార్పు వస్తోందని స్థానికులు కోరుతున్నారు. –లింగోజిగూడ